

రైల్వే స్టేషన్ సలహా మండలి సభ్యుల నియామకం

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

స్థానిక రైల్వే స్టేషన్ అభివృద్ధికి సహాయ సహకారాలు అందించడానికి, స్థానికులతో సలహా మండలి సభ్యుల నియామకం జరిగిందని, ఈ మేరకు గురువారం వాల్తేరు అసిస్టెంట్ కమర్షియల్ మేనేజర్ నుంచి ఉత్తర్వులు అందినట్లు స్టేషన్ మాస్టర్ శ్రీనివాసరావు తెలిపారు. పట్టణానికి చెందిన వర్తకులు, వ్యాపార, వాణిజ్య, వర్గాలు వినియోగదారుల సంఘం, పాసింజర్స్ సంఘం, స్థానిక విద్యాసంస్థలు యజమాన్యం, ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులుగా పనిచేస్తున్న సామాజిక దృక్పథం కలిగిన వారిని, స్థానిక ప్రజా ప్రతినిధులైన కౌన్సిలర్లను పరిగణలోకి తీసుకుని పార్వతీపురానికి చెందిన బోటు రామకృష్ణ, మాన్యం రామకృష్ణ, బి.వాసుదేవరావు, వివిఎస్ నారాయణ, డాక్టర్ చలపతిరావు, చుక్క భాస్కరరావు, దొడ్డంకి గణపతి, కౌన్సిలర్ చీకటి అనురాధ, టివి అప్పలనాయుడును నియమించినట్లు ఉత్తర్వుల పత్రాన్ని విడుదల చేశారు.

సెటిలర్లపై వ్యాఖ్యలతో... ఇరకాటంలో డిప్యూటీ సిఎం?

- కలకలం రేపుతున్న రాజన్న వ్యాఖ్యలు
- గిరిజనులపై ప్రేమతో అన్నారా? వ్యూహంలో భాగమా?

ప్రజాశక్తి - సాలూరు

డిప్యూటీ సిఎం రాజన్నదొర డిఫెన్స్‌లో పడ్డారానే చర్చ జరుగుతోంది. ఏజెన్సీ ప్రాంతంలో గల సెటిలర్లపై ఆయన చేసిన వ్యాఖ్యలు కలకలం రేపుతున్నాయి. గిరిజనుల రహదారి సమస్య పరిష్కారం కోసం ఆయన పరుష పదజాలంతో వ్యాఖ్యలు చేశారా లేక వ్యూహంలో భాగంగా మాట్లాడారా అనే చర్చ నడుస్తోంది. కొద్దిరోజుల క్రితం ఆయన గడపగడపకూ ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొట్టుపరువులో పర్యటించారు. ఆ సందర్భంలో పంచాయతీ సర్పంచ్‌తో పాటు గ్రామస్తులు రాజన్నదొరను కలిసి వారు ఎదుర్కొంటున్న సమస్యల్ని వివరించారు. ఏడాదిగా గ్రామానికి రహదారి నిర్మాణం అసంపూర్తిగా మిగిలి ఉండడంతో వారు తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు. గ్రామానికి రహదారి నిర్మాణానికి స్థానిక సెటిలర్ పమిడిముక్కల కృష్ణకిశోర్ (బబ్లూ)కు చెందిన భూమి అవసరం వుంది. ఆయన భూమి మీదుగా రహదారి నిర్మాణం చేయాల్సి ఉంటుంది. ఆయన అభ్యంతరం చేయడంతో రహదారి నిర్మాణం నిలిచిపోయింది. ఏడాదిగా ఆయన్ను ఒప్పించేందుకు స్థానిక పెద్దలు ప్రయత్నం చేస్తున్నా ఫలితం లేకపోయింది. తన భూమికి నష్టపరిహారం ఇచ్చి రహదారి నిర్మించాలని ఆయన పట్టుబడుతున్నారు. పరిహారం ఇచ్చే అవకాశం లేక ఆ రహదారి నిర్మాణాన్ని అసంపూర్తిగా వదిలేశారు. వాస్తవంగా పరిశీలిస్తే ఈ రహదారి నిర్మాణం వల్ల గిరిజనుల కంటే గిరిజనేతరులైన సెటిలర్లకే ఎక్కువ ప్రయోజనం ఉంటుంది. ఈ రహదారికి ఇరువైపులా సెటిలర్ల భూములే ఉన్నాయి. వారు సాగు చేస్తున్న వ్యవసాయ ఉత్పత్తులు మొక్కజొన్న, పామాయిల్, అరటి పంటల రవాణాకు ఈ రహదారి ఉపయోగపడుతుంది. అయితే స్థానిక సెటిలర్ల మధ్య విభేదాలు, వ్యక్తిగత ప్రయోజనాల కారణంగా కృష్ణకిశోర్ తన భూమిని రహదారి నిర్మాణానికి ఇవ్వడం లేదని తెలుస్తోంది. ఈ రహదారి నిర్మాణం వల్ల తన కంటే తన ప్రత్యర్థులకు మేలు జరుగుతుందని భావించిన కృష్ణకిశోర్ తన భూమిని ఇవ్వడం లేదని స్థానిక గిరిజనులు చెపుతున్నారు. ఈ వివాదం ఏడాదిగా పెండింగ్‌లో వుండడం, గిరిజనుల ఒత్తిడి నేపథ్యంలో డిప్యూటీ సిఎం రాజన్నదొర నోట పరుష వ్యాఖ్యలు వచ్చినట్లు తెలుస్తోంది. ఇదే పరిస్థితి కొనసాగితే సెటిలర్లు నివాసం ఉంటున్న గ్రామాలను షెడ్యూల్ గ్రామాలుగా ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరుతానని ఆయన హెచ్చరిస్తూ వ్యాఖ్యానించడం వివాదాస్పదంగా మారింది. ఏజెన్సీలో ఉన్న వందలాది మంది సెటిలర్లలో ఒకేఒక కృష్ణకిశోర్ వ్యవహార శైలి వల్ల అందరినీ ఇరకాటంలో పెట్టేలా రాజన్నదొర మాట్లాడడం తగదనే వాదనలు వినిపిస్తున్నాయి. అయితే కృష్ణ కిశోర్ (బబ్లూ) కందులపదం వంతెన నిర్మాణం విషయంలో కూడా అడ్డంకులు సృష్టించారని, వంతెన నిర్మించిన కాంట్రాక్టరుపై కోర్టులో కేసు వేయడంతో బిల్లు కూడా నిలిచిపోయిందని స్థానికులు చెబుతున్నారు. కొట్టుపరువు గ్రామానికి రహదారి నిర్మాణాన్ని తాను డిప్యూటీ సిఎం హెూదాలో వుండి కూడా పూర్తి చేయలేకపోయాననే ఆవేదనతో రాజన్నదొర ఆ పరుష వ్యాఖ్యలు చేశారా లేక ఇంకేదైనా వ్యూహంతో అన్నారా అనేది చర్చనీయాంశమైంది.



సగంలో నిలిచిపోయిన రోడ్డు పనులు

డిఫెన్స్‌లో పడ్డారా?

నియోజకవర్గంలో ఉన్న సెటిలర్లపై చేసిన వ్యాఖ్యల విషయంలో రాజన్నదొర డిఫెన్స్‌లో పడ్డారనే చర్చ జరుగుతోంది. గిరిజనుల్లో ఉన్న వ్యతిరేకతను ఈ వ్యాఖ్యల ద్వారా అనుకూలంగా మలుచుకునే ప్రయత్నంలో భాగంగానే ఆయన మాట్లాడారని ప్రతిపక్ష నాయకులు విమర్శిస్తున్నారు. గతంలో కొంతమంది గిరిజన సంఘాల నాయకులు సెటిలర్లపై ఫిర్యాదులు చేసి వారిని బెదిరించే స్థాయి వరకు వ్యవహారం వెళ్లింది. ఈ వ్యవహారంలో కొంతమంది సెటిలర్లకు గిరిజన భూవివాదదాల కోర్టు నోటీసులు జారీ చేసింది. అప్పట్లో ఈ వ్యవహారం పెద్ద దుమారం రేపింది. ఆ సమయంలో సెటిలర్లంతా తలా కొంత మొత్తం చొప్పున ఎత్తుకుని వివాదం సద్దుమణిగేలా చేసుకున్నట్లు ప్రచారం జరిగింది. ఆ తర్వాత ఇప్పుడు రాజన్నదొర సెటిలర్లపై తీవ్రమైన వ్యాఖ్యలు చేయడం, దానికి వివరణ ఇచ్చుకునే ప్రయత్నంలో సెటిలర్లకు తాను వ్యతిరేకం కాదని చెప్పడం జరిగింది.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్, జెసి, డిఆర్‌ఒ

పర్యాటక అభివృద్ధికి అవకాశం కల్పించండి

ప్రజాశక్తి - పార్వతీపురం

తోటపల్లి వద్ద పర్యాటక గ్రామ అభివృద్ధికి అవకాశం కల్పించాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ కోరారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్ జవహర్ రెడ్డి జిల్లా కలెక్టర్లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, పాఠశాల విద్య, వైద్య ఆరోగ్యం, స్పందన కార్యక్రమం తదితర అంశాలను ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తోటపల్లి రిజర్వాయర్‌కు ఆనుకుని ఉన్న ప్రదేశంలో (ఖాళీ చేసిన మార్కొండపుట్టి) పర్యాటక గ్రామ అభివృద్ధికి వినియోగించేందుకు, అక్కడ వాటర్ స్పోర్ట్స్ ఏర్పాటుకు అవకాశం ఉందని వివరించారు. పర్యాటకంగా మంచి అభివృద్ధికి అవకాశం ఉందని, తద్వారా ఉపాధి అవకాశాలు అనేక మందికి కలుగుతుందని ఆయన చెప్పారు. వీటిపై ప్రతిపాదనలు సమర్పించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అన్నారు. గర్భిణీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. ఇందులో భాగంగానే గర్భిణీలను ముందుగానే వసతి గృహాల్లో చేర్చుతున్నామన్నారు. రహదారి సౌకర్యం సక్రమంగా లేని గ్రామాలు, వాతావరణ పరిస్థితులు గమనిస్తూ మరింత అప్రమత్తంగా వ్యవహరిస్తున్నామని ఆయన చెప్పారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. పిహెచ్‌సిల్లో ఆరు పడకలు ఏర్పాటు జరుగుతుందని, తద్వారా దగ్గరలోనే వైద్య సేవలు చేరువ కానున్నాయని వివరించారు. గర్భిణీలకు ఆరోగ్య సేవలు అందించడంలో ప్రణాళికా బద్ధంగా చర్యలు చేపడుతున్నామని ఆయన పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో సంయుక్త కలెక్టర్ సి.విష్ణుచరణ్, డిఆర్‌ఒ జె.వెంకట రావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి బి.జగన్నాథ రావు, డిఐఇఒ డి.మంజుల వీణ, ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీరింగ్ అధికారి ఓ.ప్రభాకర రావు, ఐసిడిఎస్ పిడి కె.జయగౌరి, డిఇఒ ఎన్.ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపరిహారం ఇవ్వరా?

మండల సమావేశంలో సభ్యుల నిలదీత

ప్రజాశక్తి - సాలూరురూరల్

మండలంలో ఇటీవల కురిసిన అకాల వర్షాలు, భారీ గాలులకు జీడి, మామిడి పంటలకు నష్టం వాటిల్లిందని, ఇప్పటికీ బాధిత రైతులు పరిహారం ఎందుకు చెల్లించలేదని మండల వ్యవసాయాధికారిని సభ్యులు నిలదీశారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వైస్ ఎంపిపి రెడ్డి సురేష్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తొలుత వైస్ ఎంపిపి మాట్లాడుతూ సాలూరు మండలంలో జీడీ, మామిడి పంటలను గిరిజనులు రైతులు అధిక సంఖ్యలో పోడు, డి పట్టా భూముల్లో ఈ పంటలను సాగు చేస్తున్నారని, మైదాన ప్రాంతంలో కూడా ఈ పంటలను సాగు చేస్తున్నారని, ఇటీవల కురిసిన అకాల వర్షాలకు భారీగా నష్టం జరిగేనా ఇప్పటికీ ఈ పంటలకు సంబంధించి ఏ అధికారి ఎందుకు పట్టించుకోలేదని వ్యవసాయాధికారి అనురాధ పండాను ప్రశ్నించారు. అందుకు ఆమె సమాధానమిస్తూ ఈ ప్రాంతంలో పండించే అరటి, మొక్క జొన్న పంటలకు మాత్రమే క్రాప్ ఇన్సూరెన్స్ ఇస్తున్నారని జీడీ, మామిడి పంటలకు క్రాప్ ఇన్సూరెన్స్ ఇవ్వడం లేదని అన్నారు. తమ శాఖ తరుపున చాలా సార్లు పై అధికారులకు సమాచారం అందించామని, దీనికి అనుగుణంగా ఈ సంవత్సరం నుంచి శాటిలైట్ ఈ క్రాప్ చేసి ఈ పంటలకు కూడా ఇన్సూరెన్స్ ఇవ్వడానికి ప్రభుత్వం సమ్మతించిందని తెలిపారు. రైతులకు ఖరీఫ్ సీజన్లో కావాల్సిన విత్తనాలు ఆర్‌బికెల్లో సిద్ధంగా ఉన్నట్లు ఆమె తెలిపారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ మొహమ్మద్ గౌష్ జల జీవన్ మిషన్ గురించి మాట్లాడుతుండగా జీగిరాం సర్పంచ్ సూరప్పల నాయుడు స్పందిస్తూ సర్పంచులకు తెలియకుండా మీరు, కాంట్రాక్టర్లు మీకు నచ్చిన విధంగా పనులు ఎలా చేస్తారని ప్రశ్నించారు. దీనికి వైస్ ఎంపిపి స్పందిస్తూ పంచాయతీలకు సంబంధించిన ఏ కార్యక్రమమైనా స్థానిక సర్పంచులకు తెలియజేయకుండా పనులను చేయకూడదని అన్నారు. సమావేశంలో మండలంలోని వివిధ శాఖల అధికారులు వారి వారి ప్రగతిని వివరించారు. సమావేశంలో ఎంపిపి జి.రాములమ్మ, ఎంపిడిఒ గొల్లపల్లి పార్వతి, ఎఎంసి చైర్ పర్సన్ దండి అనంత కుమారి, వైస్ ఎంపిపి ప్రతినిధి సువ్వాడ శ్రీనివాసరావు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.



వివరణ ఇస్తున్న మండల వ్యవసాయాధికారి

మొక్కజొన్న నిల్వలు పరిశీలన

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని పాంచాలి, మాతుమూరు, గురివినాయుడుపేట గల మొక్కజొన్న పంటల నిల్వలను, రైతు భరోసా కేంద్రాలను జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్‌పాల్ గురువారం తనిఖీ చేశారు. ముందుగా మొక్కజొన్న రైతులతో మాట్లాడుతూ ప్రభుత్వం క్వింటాకు మద్దతు ధర రూ.1962 ప్రకటించిందని, కొనుగోలు కేంద్రాలు ద్వారా మార్క్‌ఫెడ్ కొనుగోలు చేపడుతుందని తక్కువ ధరలకు దళారీలకు అమ్మాల్సిన అవసరం లేదని తెలిపారు. అనంతరం పత్తి పంట సాగు కొరకు భూమిని తయారు చేస్తున్న రైతుతో మాట్లాడుతూ పత్తి విత్తన రకాలు, మొక్కజొన్న రకాలు గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ మొక్కజొన్న దిగుబడులు 30 నుండి 40 క్వింటాళ్ల వరకు వచ్చాయని, ఇవి సంతృప్తికరమైన దిగుబడులని తెలిపారు. అనంతరం జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ జూలైలో వర్షాలు తక్కువగా పడే అవకాశం ఉన్నందున రైతులు సబ్ సాయిలర్‌తో లోతైన వేసవి దుక్కులు చేసుకోవడం ద్వారా జూన్ నెలలో పడే వర్షపు నీటిని భూమిలో నిలువ చేసుకోవచ్చని, మేలైన రకాలను మాత్రమే సాగు చేయాలని కోరారు. అనంతరం గురువినాయుడుపేటలో గల ఎరువుల షాపు తనిఖీ చేసి నాణ్యమైన విత్తనాలు మాత్రమే విక్రయించాలని, లేనట్లయితే లైసెన్సులు కూడా రద్దు చేస్తామని డీలర్‌ను హెచ్చరించారు. గ్లైఫోసైట్ విక్రయానికి ఎలాంటి అనుమతుల్లేవని గడ్డి, పత్తి అమ్మకాలు నిషేధమని, కావున వీటిని ఎవరూ అమ్మకూడదని, కఠిన చర్యలు తీసుకోబడతాయని తెలిపారు. అనంతరం రైతు భరోసా కేంద్రాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు భరోసా కేంద్రాల్లో కియోస్క్ పనితీరు ఎరువుల నిల్వలు వివిధ రిజిస్టర్లు ఫైళ్ల తనిఖీ నిర్వహించారు. తప్పనిసరిగా అన్ని రైతు భరోసా కేంద్రాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి రిపోర్టును ఇవ్వాల్సిందిగా మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు, ఎడిఎ మధుసూదన్‌రావును ఆదేశించారు. గ్రామ వ్యవసాయ సలహా మండలి సమావేశాలలో తప్పనిసరిగా కష్టమ్ హైరింగ్ సెంటర్ల అద్దె వివరాలను నమోదు చేయాలని, ఇంకా మొక్కజొన్న రైతులను రిజిస్ట్రేషన్ పూర్తి చేయనందుకు గ్రామ వ్యవసాయ సహాయకులకు మెమోలను అందజేశారు. పిఎం కిసాన్ లబ్ధిదారుల ఇకెవైసి వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు



వేసవి దుక్కులను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ జెడి రాబర్ట్‌పాల్



రోగులతో మాట్లాడుతున్న డిఐఒ జగన్మోహనరావు

వ్యాధి నిర్ధారణ పరీక్షలు తప్పనిసరి

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్/గరుగుబిల్లి

జ్వర లక్షణాలు కనిపిస్తు వెంటనే నిర్ధారణ పరీక్షలు చేసి, ఆ రోగికి మందులు అందజేసి ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ టి.జగన్మోహనరావు అన్నారు. మండలంలోని మరుపెంటలో గురువారం నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఆయన సందర్శించారు. ఈ మేరకు ఆయన శిబిరంలో ఏర్పాటు చేసిన మందులు, వ్యాధినిర్ధారణ పరికరాలు తనిఖీ చేశారు. రోగుల ఆరోగ్య తనిఖీల వివరాలు, ఒపి రికార్డులను పరిశీలించి అనారోగ్య సమస్యలు, నిర్ధారణ పరీక్షల వివరాలు పక్కగా నమోదు చేయాలని, అలాగే ఆయా వ్యాధుల వారీగా, దీర్ఘకాలిక వ్యాధుల వివరాలు ఎప్పటికప్పుడు ఆన్లైన్‌లో నమోదు చేయాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. అనారోగ్య సమస్యలతో అక్కడకు వచ్చిన ప్రజలతో ఆయన మాట్లాడి ఆరోగ్య పర్యవేక్షణ చేసి అవసరమైన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఒఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచి, వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలను అప్రమత్తం చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం డిఐఒ అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి పిల్లల ఆరోగ్య పర్యవేక్షణ రికార్డులను పరిశీలించి బరువు, శారీరక ఎత్తు వయస్సుకు తగ్గట్టుగా ఉన్నదీ లేనిదీ జాగ్రత్తగా పరిశీలించి నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. సిరప్‌లు, మందులను తనిఖీ చేసి వాటి వినియోగంపై ఆరా తీశారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక, సూపర్‌వైజర్ ఉదయకుమారి, వైద్య సిబ్బంది శిరీష, సుమతి, 104 సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

తాగునీటి సౌకర్యం కల్పించాలి : సిపిఎం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని అన్ని గ్రామాలకు తాగునీటి సౌకర్యం కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యులు ఎం.తిరుపతిరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. 2013లో కాంగ్రెస్ హయాంలో మండలంలోని 50 గ్రామాలకు 13వ ఆర్థిక సంఘం నిధులతో సుమారు రూ.15కోట్లతో తాగునీటి సౌకర్యం కల్పించేందుకు వీలుగా స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద శంకుస్థాపన చేశారన్నారు. అయితే దాని నుంచి కేవలం 27 గ్రామాలకు మాత్రమే తాగునీటి సరఫరా చేస్తున్నట్లు ఆయన అన్నారు. వండువ ఉపరితల పథకం ద్వారా 27 గ్రామాలకు తాగునీటి సరఫరా చేస్తున్నప్పటికీ పథకం ప్రారంభించి మూడు నాళ్లముచ్చటగా దువ్వానపాడు, కొంచ గ్రామాలకు తాగునీటి సరఫరా నిలిచిపోయిందన్నారు. దీంతో గ్రామస్తులు గుక్కెడి నీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పథకం ఉన్నప్పటికీ సమీపంలో ఉన్న నది వద్దకు గుక్కెడు నీటి కోసం పరుగులు తీస్తున్నారన్నారు. ప్రతి ఇంటికీ కుళాయి పాయింట్ల ద్వారా తాగునీరందించాలని ఉద్దేశంతో జలజీవన్ మిషన్ ద్వారా మండలంలో 13 గ్రామాల్లో తవ్వకాలు జరిపి పైపులు అమర్చినప్పటికీ వాటి ద్వారా చుక్కనీరు రాకపోవడంతో గ్రామాల్లో ఉత్సవ విగ్రహాల దర్శనమిస్తున్నాయని విమర్శించారు. ఈ విషయంపై స్థానిక ఎమ్మెల్యే వి.కళావతి చర్యలు తీసుకొని గ్రామీణ ప్రాంతాల ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు వీలుగా తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఐటిఐలో ప్రవేశానికి దరఖాస్తులు

ప్రజాశక్తి - సాలూరు

పార్వతీపురం మన్యం జిల్లాలో గల మూడు ప్రభుత్వ, నాలుగు ప్రయివేటు ఐటిఐల్లో ప్రవేశానికి జూన్ 6లోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ ఐటిఐల జిల్లా కన్వీనర్ వి.రవికుమార్ ఒక ప్రకటనలో కోరారు. ఈనెల 10 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. iti.gov.ap.in వెబ్ సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఎస్ఎస్ సి, ఆధార్ ధ్రువపత్రాలు, ఫోన్ నెంబర్లతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సాలూరు ప్రభుత్వ ఐటిఐలో జరుగునన్న అడ్మిషన్ సమయంలో ఒరిజినల్ ధ్రువపత్రాలతో పాటు అక్ నాలెడ్జ్‌మెంట్‌లను తీసుకుని రావాలని కోరారు. సాలూరు, సీతంపేట, గుమ్మలక్ష్మీపురాల్లో ఉన్న ప్రభుత్వ ఐటిఐలో, పార్వతీపురం, బల్జిపేట, నర్సిపురంల్లో ఉన్న నాలుగు ప్రయివేటు ఐటిఐల్లో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపల్ వి.రవికుమార్ ఆ ప్రకటనలో తెలిపారు.



వైద్య, ఐసిడిఎస్ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ కల్పనకుమారి

వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి : పిఒ

ప్రజాశక్తి - సీతంపేట

ఆసుపత్రిలో పనిచేసే సిబ్బంది నిత్యం అప్రమత్తంగా ఉండాలని ఐటిడిఎ పిఒ కల్పన కుమారి అన్నారు. గురువారం వైద్యశాఖ, ఐసిడిఎస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ కుక్క, పాముకాటు బాధితులు ఎక్కువ అవుతున్నారని, అటువంటి కేసుల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని కోరారు. ఆసుపత్రిలో మందులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. గర్భిణుల పట్ల అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. చిన్నారుల ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నారు. గ్రామాల్లో తప్పనిసరిగా స్ప్రేయింగ్ చేయాలని, మలేరియా సిబ్బందికి సూచించారు. డెంగీ కేసులు వస్తే వెంటనే తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫ్రైడే-డ్రైడేను పక్కాగా నిర్వహించాలని సూచించారు. క్షేత్రస్థాయి వైద్య సిబ్బంది నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. గర్భిణీలకు, చిన్నారులకు పౌష్టికాహారం అందజేయాలని ఐసిడిఎస్ అధికారులకు సూచించారు. చిన్నారుల ఆరోగ్యంపై వైద్యశాఖతో సమన్వయం చేసుకొంటూ పనిచేయాలని అన్నారు. సమావేశంలో పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం డిఎంహెచ్ఒలు జగన్నాధరావు, మీనాక్షి, డిఎంఒలు, ఐసిడిఎస్ పీడీలు జయదేవి, విజయగౌరీ, సిడిపిఒలు, వైద్యాధికారులు, మలేరియా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బిజెపి ఎంపిని అరెస్టు చేయాలి

రెజ్లర్లకు మద్దతుగా ప్రజాసంఘాల నిరసన

ప్రజాశక్తి - సాలూరు

రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షులు, బిజెపి ఎంపి బ్రిజ్‌భూషణ్‌ను వెంటనే అరెస్టు చేయాలని కోరుతూ డివైఎఫ్ఐ, సిఐటియు, ఐద్వా నాయకులు, కార్యకర్తలు గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్వైనాయుడు మాట్లాడుతూ దేశానికి అనేక పతకాలు సాధించిన మహిళా రెజ్లర్లను లైంగిక వేధింపులకు గురి చేసినట్లు ఎంపి బ్రిజ్ భూషణ్‌పై కేసు నమోదు చేసినా పోలీసులు అరెస్టు చేయకపోవడం దారుణమని అన్నారు. వెంటనే ఎంపి బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా, డివైఎఫ్ఐ నాయకులు టి.స్వప్న, మాధవ, పలువురు కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.



ఆందోళనుద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు నాయకులు ఎన్‌వై నాయుడు

నిర్మాణ పనులు వేగవంతం చేయండి

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలో ఉన్న రైతు సంఘం ఉత్పత్తిదారుల సంఘాల సేకరణ కేంద్రాల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఉద్యానవన సహాయ ఇన్చార్జి అధికారి రత్నాచార్యులు అన్నారు. మండలంలోని సీతంపేట, రేగులుగూడ, గజిలి సేకరణ కేంద్రాల నిర్మాణ పనులను సందర్శించారు. ఈ పనులు వేగవంతమైతే రైతు సంఘ ఉత్పత్తిదారులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. పండించిన పంటలు నిల్వ చేసుకొని అవసరమైన చోట మార్కెట్ చేసుకోవచ్చన్నారు. రైతులు పండించిన పంటలను కొనుగోలు చేసి వ్యాపారవేత్తలుగా మారాలన్నారు. ఆయనతో పాటు జిల్లా ఉద్యాన శాఖ అధికారి కె.సత్యనారాయణరెడ్డి, హార్టికల్చర్ అధికారి అమరేశ్వరి తదితరులు ఉన్నారు.



సేకరణ కేంద్రం పనులను పరిశీలిస్తున్న ఉద్యానవన హాయ ఇన్‌ఛార్జి రత్నాచార్యులు



ఆక్రమణపై అధికారులకు సూచనలు ఇస్తున్న ఆర్‌డిఒ హేమలత

ఆక్రమణలు పరిశీలించిన ఆర్‌డిఒ

పార్వతీపురంరూరల్ : పట్టణంలోని బెలగాం శివారులో గల లక్ష్మునాయుడు చెరువులో ఆక్రమణలను, అక్రమ నిర్మాణాలను గురువారం ఆర్‌డిఒ కె.హేమలత, తమ సిబ్బందితో కలిసి పరిశీలించారు. చెరువును సందర్శించి, అందులో ఉన్న నిర్మాణాలను వెంటనే తొలగించాలని, నిర్మాణాలు చేపడుతున్న వారిని గుర్తించి నోటీసులు జారీ చేసి తగు చర్యలు తీసుకోవాలని క్షేత్ర స్థాయి సిబ్బందికి సూచించారు. ఆక్రమణలపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి పట్టాలు ఇచ్చిన అధికారులపై సైతం చర్యలు తీసుకోవాలని స్థానికులు, ప్రజా సంఘాల నాయకులు ఆర్‌డిఒకు కోరారు.

గంగాపురంలో ఫ్యామిలీ డాక్టర్


పార్వతీపురం రూరల్ : మండలంలోని గంగాపురంలో ఫ్యామిలీ విధానంలో డాక్టర్ ఐశ్వర్య ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించడం ఇది రెండోసారి అని అన్నారు. గ్రామంలో 68 రకాల మందులు అవసరమైన వారికి అందజేస్తున్నామన్నారు. అంగన్‌వాడీ చిన్నారులకు, వృద్ధులకు, గర్భిణులకు ఇక్కడే వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. ఈ శిబిరాన్ని అందరూ వినియోగించుకోవాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంవిఆర్ కృష్ణాజీ

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

పార్వతీపురం రూరల్ : నియోజకవర్గంలో జరుగుతున్న గడపగడపకు కార్యక్రమంలో కేటాయించిన పనులతో పాటు అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని, ఇప్పటికే పనులు జరుగుతున్నవి పూర్తి చేయాలని పంచాయతీరాజ్ ఎస్ఇ ఎంవిఆర్ కృష్ణాజీ అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన సీతానగరం, బలిజిపేట, పార్వతీపురం మండలాల్లో జరుగుతున్న పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు జరిగిన పనులకు బిల్లులు చెల్లించడమైందని, జరుగుతున్న పనులను వేగవంతం చేసి పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలని, వీటిపై ఒక నివేదిక తయారు చేసి వెంటనే అందించాలని కోరారు. కార్యక్రమంలో డిఇ రత్నకుమార్, సహాయ ఇంజనీర్లు చంద్రమౌళి, అంబేద్కర్‌తో పాటు సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సాంకేతిక సహాయకులు పాల్గొన్నారు.



పాడిరైతులతో మాట్లాడుతున్న రైతుసంఘం నాయకులు బంటు దాసు

నేడు జిల్లా పాడి రైతుల సమావేశం

కలెక్టరేట్ : పాడిరైతుల జిల్లా సమావేశం శుక్రవారం స్థానిక ఎపి ఎన్జీవోహోంలో జరుగుతుందని ఎపి రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు బంటు దాసు తెలిపారు. ఈ సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరుతూ మండలంలోని సంగంవలస, చినబొండపల్లి, పెద్దబొండపల్లి, పుట్టూరులో గురువారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా రైతులకు కరపత్రాలు పంపిణీ చేసి సమావేశం ఆవశ్యకతను వివరించారు. ఈ సమావేశంలో పాల రైతుల సమస్యలతో పాటు జిల్లాలో రైతులందరి సమస్యలపై, రైతు సంఘం నిర్మాణ అవసరంపై చర్చ జరుగుతుందని, కావున రైతులంతా సమావేశానికి హాజరు కావాలని కోరారు.



విద్యార్థులను అభినందిస్తున్న జమ్మాన ప్రసన్నకుమార్

ఇదే స్ఫూర్తితో ఉన్నత విద్యను అభ్యసించాలి

పార్వతీపురంటౌన్ : ఇదే స్ఫూర్తితో విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత విద్యలను అభ్యసించాలని టిట్కో ఛైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ విద్యార్థులతో అన్నారు. స్థానిక 17వ వార్డుకు చెందిన యాండ్రాపు శ్రీనివాసరావు కుమార్తె హిమజ పదో తరగతి 591 మార్కులు, దేవరాపల్లి శాంతిరాజు కుమార్తె లతశ్రీ ఇంటర్ ఫలితాల్లో 969 మార్కులను సాధించారు. ఈ మేరకు గురువారం వీరికి జమ్మాన ప్రసన్నకుమార్ స్వీట్స్ తినిపిస్తూ దుశ్శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంతటి విజయం సాధించడం అభినందనీయమన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని విజయాలు సాధించి తల్లిదండ్రులకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్, పార్టీ ముఖ్య నేతలు స్థానిక కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో సమస్యల పరిష్కారానికి కృషి

గుమ్మలక్ష్మీపురం : స్థానిక గ్రంథాలయంలో సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు సర్పంచ్ బొత్తాడ గౌరీ శంకర్రావు తెలిపారు. గురువారం ఆయన గ్రంథాలయాన్ని సందర్శించి సమస్యలను లైబ్రరీన్ సుకన్యను అడిగి తెలుసుకున్నారు. గ్రంథాలయంలో ఫర్నీచర్, ఫ్యాన్లు ఎందుకు లేవన్న విషయాన్ని లైబ్రేరియన్‌ను ప్రశ్నించారు. గ్రంథాలయంలో ఉన్న సమస్యలను జిల్లా గ్రంథాలయం చైర్మన్‌తో ఫోన్లో మాట్లాడినట్లు తెలిపారు. గ్రంథాలయంలో మౌలిక సదుపాయాల కొరత ఉందని, అవి త్వరగా ఏర్పాటు చేయాలని కోరినట్లు చెప్పారు. సానుకూలంగా స్పందించినట్లు సర్పంచ్ తెలిపారు.



గ్రంథాలయాధికారితో మాట్లాడుతున్న సర్పంచి గౌరీశంకరరావు

గొంతెండుతున్న గ్రామాలు

- ఇబ్బందుల్లో ప్రజలు
- అంతంత మాత్రంగానే చర్యలు

ప్రజాశక్తి-పాలకొండ, పాలకొండ రూరల్

ఎండలు మండిపోతున్నాయి. మండలంలో పలు గ్రామాల్లో ప్రజలు దాహార్తితో అల్లాడుతున్నారు. నీటికోసం కటకటలాడుతున్నారు. 32 పంచాయతీల్లో దాదాపు సగం పంచాయతీల్లో ఇదే పరిస్థితి కనిపిస్తుంది. అధికారుల చర్యలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. దీంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. భూగర్భజలాలు అడుగంటి పోవడంతో బోర్లు కూడా పనిచేయడం లేదు. దీంతో ప్రజలు ఏం చేయాలో తెలియక నానా అవస్థలు పడుతున్నారు.

మండలంలో పలు గ్రామాల్లో నీటి కష్టాలు ఎక్కువగా ఉన్నాయి. భాసూరు, వెలగవాడ, దోమడ, అక్కిరాజువేట, కొత్త బర్ల, ఆర్లి, వెంకటాపురం తదితర గ్రామాల్లో ప్రజలు నీటికోసం నానా అవస్థలు పడుతున్నారు. భాసూరు, కొత్తబర్ల గ్రామాల్లో చెలమల నీటే ఆధారమవుతుంది. వీరికి కాలంతో పనిలేకుండా ఏ సీజన్లోనైనా చెలమ నీరే దిక్కవుతుంది. ఎంతో కాలం నుంచి ఈ సమస్య ప్రజలను పట్టిపీడిస్తుంది. ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నారు, అధికారులు వస్తున్నారు అయినప్పటికీ ఈ సమస్య పరిష్కారానికి చొరవ తీసుకోలేకపోతున్నారు. భాసూరులో సుమారు 2వేల మంది జనాభా ఉన్నారు. బోర్లు ఉన్నప్పటికీ అవి పూర్తిస్థాయిలో పనిచేయకపోవడంతో చెలమల నీరే ఆధారమవుతుంది. ఇక్కడ రక్షిత మంచినీటి పథకం నిర్మించినప్పటికీ ఇన్‌ఫిల్టర్ బావి లేకపోవడంతో వృథాగానే ఉంది. దోమలడలో నేలబావి నుంచి మోటారు ద్వారా 200 కుటుంబాలకు నీటి సరఫరా చేస్తున్నప్పటికీ వేసవి కావడంతో బావిలో నీరు అడుగంటిపోయాయి. దీంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఆర్లిలో రక్షిత మంచినీటి పథకం పనిచేయకపోవడంతో నీటికష్టాలు ఎక్కువగా ఉన్నాయి. ఇలా పలు గ్రామాల్లో ఇదే పరిస్థితి కనిపిస్తుంది.



భాసూరులో చెలమల నీరు పట్టుకుంటున్న మహిళలు



దోలమడలో ఈ బావినీరే ప్రజలకు ఆధారం

బోర్లే ఆధారం....

మండలంలో కొన్ని గ్రామాలకు బోర్లే ఆధారమవుతున్నాయి. ఎల్ఎల్‌పురం, కోటిపల్లి, టిడి పారాపురం తదితర ప్రాంతాల్లో బోరు నీరే ప్రజలకు ఆధారంగా మారుతుంది. అయితే ఆయా గ్రామాల్లో జనాభాకు తగ్గ బోర్లు లేకపోవడంతో ప్రజలకు నీటి అవస్థలు తప్పడం లేదు. టిడిపారాపురంలో బోర్లు మూడు మరమ్మతులకు గురైనా ఇంతవరకూ మరమ్మతులు చేపట్టిన దాఖలాల్లేవు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

జీడిపిక్కలకు మార్కెట్ సౌకర్యం కల్పించాలి

ప్రజాశక్తి - సీతంపేట

గిరిజన అటవీ ఉత్పత్తులకు మార్కెట్ సదుపాయం కల్పించకపోవడంతో స్థానిక ఐటిడిఎ పరిధిలో గల జీసిసి, వెలుగు వంటి సంస్థలు ఉన్నప్పటికీ గిరిజనులు దోపిడీకి గురి అవుతున్నారని గిరిజన సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.లక్ష్మణరావు విమర్శించారు. గురువారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. జీడిపప్పు కేజీ రూ.700 ధర పలుకుతుంటే పిక్కలు కేజీ రూ.87కు ప్రైవేట్ వ్యాపారాలు కొని గిరిజనులను తీవ్రంగా దోపిడీ చేస్తున్నారని అన్నారు. జీడిపిక్క - ఐతుకు పక్కా అని ఐటిడిఎ ఇచ్చిన నినాదం గిరిజనులకు కాకుండా దళారులకు ఉపయోగపడిందని విమర్శించారు. తూకంలో కూడా కొందరు మోసం చేస్తున్నట్లు తమ దృష్టికి ఉందన్నారు. ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి ఈ విషయంపై దృష్టి సారించి గిరిజనులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో పి.సాంబయ్య, సాయికుమార్ ఉన్నారు.

ప్రభుత్వ కళాశాలలో చేరండి

సీతానగరం : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ బి.రేణుక ఆధ్వర్యంలో గురువారం పదో తరగతి పాసైన విద్యార్థుల వద్దకు సీతానగరము, చినబోగిలి, పెదబోగిలి తదితర గ్రామాల్లో నాలుగు బృందాలుగా అధ్యాపకులు వెళ్లి ప్రభుత్వ కళాశాలలో జాయిన్ కావాలని, ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని, కళాశాలలో ఉన్న సౌకర్యాలను విద్యార్థులకు, తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు రవికుమార్, రామకృష్ణ, శ్రీధర్, మోహనరావు, నవీన్, అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

డిఇఒను కలిసిన ఆదివాసీ ఉపాధ్యాయులు

సాలూరు : జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్.ప్రేమ్‌కుమార్‌ను ఆదివాసీ ఉపాధ్యాయుల సంఘం జిల్లా నాయకులు గురువారం కలిశారు. పార్వతీపురంలో గల డిఇఒ కార్యాలయంలో ప్రేమ్ కుమార్‌ను ఆదివాసీ ఉపాధ్యాయుల సంఘం విజయనగరం జిల్లా అధ్యక్షులు అమర్‌నాథ్, నాయకులు తవిటన్నదొర, మన్యం జిల్లా అధ్యక్షులు జన్ని పైడిరాజు, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, నాయకులు సురేష్, సూర్యనారాయణ, చక్రపాణి, సన్యాసిరావు, సింహాచలం కలిసి సమస్యలు వివరించారు. సమస్యలేమైనా వుంటే తన దష్టికి తీసుకు రావాలని, పరిష్కారానికి కృషి చేస్తానని డిఇఒ ప్రేమ్ కుమార్ హామీ ఇచ్చారు.

బాధితులకు అండగా ఎమ్మెల్యే జోగారావు

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

అనుకోని ప్రమాద సంఘటన వల్ల ఆప్తులను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో మునిగి ఉన్న గిరిజనుల కష్టాన్ని తెలుసుకొని వారి దగ్గరకు వెళ్లి వారికి అవసరమైన సహాయ సహకారాలు అందజేసి వారిలో ఆత్మ స్థైర్యాన్ని కల్పించి అండగా నిలిచారు స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు. వివరాల్లోకి వెళితే సాలూరు నియోజకవర్గం మెంటాడ మండలం రెడ్డివానివలసకు చెందిన గిరిజనులు బుధవారం బందలుప్పి పంచాయతీ, నిమ్మవానివలసలో జరిగిన వివాహ శుభ కార్యక్రమానికి వెళ్తుండగా రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ప్రాణాలు కోల్పోయిన ఘటనతో విషయం తెలుసుకున్న వారి బంధువులు పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి గురువారం వచ్చి మృతదేహాల కోసం నిరీక్షిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే జోగారావు ఏరియా ఆసుపత్రి వైద్యాధికారులు, పోలీస్ అధికారులతో మాట్లాడి పోస్ట్‌మార్టం త్వరగా చేయించి వారికి వాహనాల సౌకర్యం కల్పించి అవసరమైన సహాయ సహకారాలు అందచేసి ఇంకేమైనా అవసరం ఉన్నా తనకు ఫోన్ చేస్తే తప్పక సహాయం చేస్తానని భరోసా ఇచ్చారు. దీంతో బాధిత గిరిజనులు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.



గిరిజనులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి ఉద్యమం

ప్రజాశక్తి - కలెక్టరేట్

జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు పూర్తిచేయాలని కోరుతూ దశలవారీగా ఉద్యమాలు చేపడతామని ఎపి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు వెలగాడ శ్రావణ్ కుమార్,బుడితి అప్పలనాయుడు తెలిపారు. ఇటీవల జరిగిన జిల్లా మహాసభకు హాజరైన ప్రతినిధులు చర్చించి చేసిన తీర్మానాల అమలు కోసం క్షేత్రస్థాయి పర్యటన చేసి రైతులకు అండగా భవిష్యత్ కార్యాచరణ ఉంటుందని అన్నారు. రైతు సమస్యలు పరిష్కరించడంలో సంఘం తనవంతుగా కృషి చేస్తుందని పేర్కొన్నారు. దశాబ్దాల సమస్యగా ఉన్న జంఝావతి రిజర్వాయర్ పూర్తి చేయడానికి ఉన్న అడ్డంకులను అధిగమించడానికి పాలకపక్షం తక్షణమే ఒడిశా ప్రభుత్వంతో చర్చలు జరిపి త్వరితగతన సమస్య పరిష్కరించి రిజర్వాయర్ పూర్తికి కావాల్సిన నిధులను మంజూరు చేసి పనులు ప్రారంభించాలని దీనికై ఆయకట్టు రైతులతో కార్యాచరణకై ఈనెల 31న పార్వతీపురంలో సదస్సు నిర్వహించడం జరుగుతుందని ప్రకటించారు. జిల్లాలో ఉన్న ఏకైక చక్కెర పరిశ్రమ లచ్చయ్యపేటను తక్షణమే ప్రభుత్వం స్వాధీనపర్చుకొని క్రషింగ్ చేయాలని సంఘం డిమాండ్ చేస్తుందన్నారు.

ఉపాధి పని ఒక్కపూటే పెట్టాలి

ప్రజాశక్తి - సాలూరురూరల్

ఉపాధి హామీ చట్టం ద్వారా రెండు పూటలా పని రద్దు చేయాలని, రోజుకు రూ.600 కూలి ఇవ్వాలి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివాస రావు డిమాండ్ చేశారు. ఉపాధి హామీ చట్టం ద్వారా జరుగుతున్న రెండు పూటలా పని విధానాన్ని రద్దు చేయాలని, ప్రతి కూలికి రోజుకు రూ.600 ఇవ్వాలని కోరుతూ ఈనెల 15న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాలో పాల్గొనాలని కోరుతూ మామిడిపల్లి, బాగువలస, మరిపల్లి, కాకుడువలస గ్రామాల్లో ప్రచార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న శ్రీనివాసరావు మాట్లాడుతూ రెండు పూటలా పని విధానాన్ని రద్దు చేయాలని, ఏడాది 200 రోజులు పని కల్పించాలని, రోజుకు రూ.600కూలి ఇవ్వాలని, పాత బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ప్రమాదవశాత్తూ మరణిస్తే రూ.10 లక్షలు బీమా ఇవ్వాలని, పని ప్రదేశంలో నీరు, మజ్జిగ, టెంట్లు, పారలు, గునపాలు ఇవ్వాలని, ఉపాధి హామీ చట్టాన్ని కూలీలను దూరం చేసి పూర్తిగా రద్దు చేయాలని చూస్తున్నారని ప్రభుత్వ విధానాలను ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రాము,అప్పారావు,లక్ష్మణ పాల్గొన్నారు.

రేషన్ పంపిణీలో తీవ్ర జాప్యం

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

పట్టణంలో రేషన్ సరుకుల పంపిణీలో తీవ్రమైన జాప్యం జరుగుతుందని, ఈనెల 11వ తేదీ వచ్చినా సగం వార్డుల్లో పంపిణీ జరగలేదని, సకాలంలో రేషన్ సరుకులు అందేందుకు చర్యలు చేపట్టాలని సిపిఎం పట్టణ కార్యదర్శి గొర్లి వెంకటరమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం సిపిఎం సభ్యులతో కలిసి తహశీల్దార్ శివన్నారాయణకు వినతి అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ కొన్ని నెలలుగా పట్టణంలోని పలు రేషన్ డిపోల్లో బండ్లద్వారా కందిపప్పు, పంచదార ఇవ్వడం లేదని, ఈనెల ఇంతవరకు రేషన్ బియ్యం ఇవ్వకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. పైగా పండగలు, శుభకార్యాలు జరుగుతున్నాయని, దీనిపై విచారణ జరిపి పట్టణ ప్రజలకు సకాలంలో రేషన్ బియ్యంతో పాటు పప్పు, పంచదార అందించేలా చర్యలు చేపట్టాలని తహశీల్దారును కోరారు. దీనికి ఆయన స్పందించి సివిల్ సప్లై డిప్యూటీ తహశీల్దార్ రమణను పిలిపించి ఫిర్యాదుపై ఆరా తీసి, సరుకులు పంపిణీ వేగవంతం చేయాలని, జాప్యం జరిగితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు పాకల సన్యాసిరావు, బంకురు సూరిబాబు, సంచాన ఉమా, మాజీ కౌన్సిలర్ పాత గౌరీశంకరరావు పాల్గొన్నారు.



తహశీల్దార్‌కు వినతిని అందజేస్తున్న సిపిఎం నాయకులు

ఏనుగుల కవ్వింపునకు పాల్పడితే చర్యలు

ప్రజాశక్తి - భామిని

మండలంలోని బొమ్మిక, పకుడిభద్ర పరిసర గ్రామాల్లో సంచరిస్తున్న ఆరు ఏనుగుల గుంపును చూద్దామని చెప్పి పరిసర గ్రామ ప్రజలు వచ్చి ఏనుగుల ప్రశాంత వాతావరణం చెడగొట్టి, కవ్వింపు చర్యలు చేస్తున్నారని అలా చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని ఫారెస్ట్ రేంజర్ కె.తవిటినాయుడు హెచ్చరించారు. ఈ మేరకు ఆయా గ్రామాల్లో అవగాహన కల్పించారు. కవ్వింపు చర్యల వల్ల ఏనుగులు ప్రజలపై దాడి, పరిసర గ్రామాల్లోని పంట పొలాలను నాశనం చేసే అవకాశం ఉందన్నారు. ఏనుగుల ప్రశాంతతను చెడగొడుతూ, కవ్వింపునకు పాల్పడే వారి వివరాలు ఇవ్వాలని స్థానిక సచివాలయానికి సమాచారం ఇచ్చామని, స్థానిక పోలీసులు సమన్వయంతో ఇటువంటి వారిపై చర్యలు తప్పవని అన్నారు. ఇకపై ఎవరూ ఏనుగులు సంచరించే పరిసర ప్రాంతాల్లో అనవసరంగా తిరగరాదు సూచించారు. అని ఎఫ్ ఆర్ ఓ సూచించారు. కార్యక్రమంలో ఎఫ్‌డిఒ తారకేశ్వరరావు, హరికృష్ణ, బీట్ అధికారి లక్ష్మీనారాయణ, సచివాలయ సెక్రటరీ శ్రీనివాసరావు, సిబ్బంది గంగాధర్ వున్నారు.

పెదపెంకిలో దాహం కేకలు

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని పెదపెంకిలో గత వారం రోజులుగా మంచినీరు లేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బాపూజీ గ్రంథాలయ వ్యవస్థాపకులు ఈర్ల సంజీవనాయుడు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచినీరందక గురువారం ప్రజలు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారని, వారం రోజులుగా మంచినీరు తాగడానికి అందుబాటులో లేదని, స్థానికంగా ఉన్న పంచాయతీ కార్యదర్శి గానీ, సంబంధిత అధికారులు గానీ, ఈ విషయంపై స్పందించలేదని ఆందోళన వ్యక్తం చేశారు. వాటర్ ట్యాంక్ దగ్గర గానీ మోటర్ రిపేర్ విషయంలో గానీ పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోలేదని, దీనివల్ల ప్రజలకు మంచినీటి అంతరాయం కలుగుతుందని ఆయన అన్నారు. వెంటనే అధికారులు స్పందించి గ్రామంలో మంచినీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు దాహం కేకలు తీర్చాలని ఆయన కోరారు. కలుషిత నీరు తాగడం వల్ల ప్రజలు వ్యాధులు బారిన పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.



తాగునీటి సమస్యపై చెబుతున్న గ్రామస్తులు

ఉపాధ్యాయ బదిలీలపై ప్రతిపాదనలు

గుమ్మలక్ష్మీపురం : త్వరలో జరగనున్న ఉపాధ్యాయ బదిలీలపై విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్ కుమార్‌కు ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం పక్షాన ప్రతిపాదనలు పంపించినట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సామల సింహాచలం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఉపాధ్యాయ సంఘాల సమావేశంలో ఉపాధ్యాయ బదిలీలపై సంఘాల నుంచి తగిన సూచనలను, ప్రతిపాదనలను ఈనెల 10లోగా రాష్ట్ర విద్యాశాఖ అధికారులకు పంపించాలని చెప్పారన్నారు. ఈ మేరకు ప్రతిపాదనలు పంపామన్నారు.



కాలువలో పూడికలు తీస్తున్న పారిశుధ్య కార్మికుడు

కాలువల్లో పూడికతీత

ప్రజాశక్తి వార్తకు స్పందన

పార్వతీపురం టౌన్ : పట్టణంలోని కాలువల్లో పూడికతీతలను మున్సిపల్ ఉద్యోగులు తొలగించారు. ప్రజాశక్తిలో ఉప్రచురితమైన 'కాలువల పరిస్థితి ఇలా.... మురుగునీరు పోయేదెలా... అన్న వార్తకు స్పందించారు. ఈ మేరకు మున్సిపల్ ప్రజారోగ్య అధికారి సిహెచ్ మురళి ఆదేశాల మేరకు పట్టణంలోని 22వ వార్డు గాంధీ సత్రం వీధిలో పారిశుధ్య కార్మికులు కాలువలను శుభ్రపర్చి మురుగు నీరు పోయేందుకు మార్గం సులభ చేశారు. దీంతో ఆ వార్డులోని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. వీటితో పాటు పలు వార్డుల్లో ఉన్న కాలువలను శుభ్రపరిచారు.

మేటుపై పీడీ ఆగ్రహం


ప్రజాశక్తి - బలిజిపేట

పెదపెంకి పంచాయతీ బైరిపురంలోని కమ్మరిబందలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ కె.రామచంద్రరావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కాగాన అనూష అనే మేటు ఉపాధి హామీ నిబంధనలకు వ్యతిరేకంగా తల్లి స్థానంలో కొడుకుచే పని చేయించడం పట్ల ఆమెపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మిగతా పనుల వద్ద సౌకర్యాలకు చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఉపాధి పని ప్రాంతాల వద్ద పనులు జరిపించిన వారిపై చర్యలు తీసుకుంటామని ఎటువంటి అక్రమాలకు పాల్పడిన వారిపై కూడా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ భానుమూర్తి, ఎపిఒ కె.కేశవరావు, ఇసి సిహెచ్ శ్రీనివాసరావు, సాంకేతిక సహాయకులు పాల్గొన్నారు.

వైసిపి కార్యకర్తను పరామర్శించిన ఎమ్‌పి, ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని గంగాడకు చెందిన వైసిపి కార్యకర్త దత్తి శివరాం గత కొంత కాలంగా అనారోగ్యం కారణంగా చికిత్స చేయించుకొని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ మేరకు గురువారం ఆయన ఇంటికి ఉమ్మడి జిల్లాల ఎంపి బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే అలజంగి జోగారావు వెళ్లి పరామర్శించి ఆరోగ్య సమాచారం అడిగి తెలుసుకున్నారు. తనకు అందరం అండగా ఉన్నామని, ఎలాంటి అధైర్యం పడకుండా త్వరగా కోలుకోవాలని తెలిపారు. వీరి వెంట మండల ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



బాధితునికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి

గణితంతోనే మనిషి ప్రయాణం

భామిని : ప్రతి ఒక్కరి జీవన క్రమంలో గణితం మిళితమై ఉంటుంది, గణిత అంశం లేని రోజు మనిషి జీవితంలో లేదని గణిత ఉపాధ్యాయులు పెద్దిన సన్యాసిరావు అన్నారు. స్థానిక గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో గణిత ఉపాధ్యాయులు సన్యాసిరావు గణిత ప్రాథమిక అంశాలు, వివరాలు, పలు రంగాల్లో ఉన్నత లక్ష్యలు సాధించాలంటే గణితం తప్పనిసరి అని, విద్యార్థులు గణితం పట్ల ఆశక్తి కనబరచాలని తెలిపారు. అనంతరం సచివాలయం మత్స్య సహాయకులు ఆదినారాయణ బేసిక్ గ్రామర్, స్పోకెన్ ఇంగ్లీష్ అంశాలపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో లైబ్రయిన్ సునీత, 30 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

హాకీలో తులసికి అవార్డు

వేపాడ : మండలంలోని బానాది గ్రామానికి చెందిన కుప్ప తులసి 13వ జాతీయ హాకీ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరపున పాల్గొని పంజాబ్, గుజరాత్ క్రీడాకారులను ఓడించి పతకం సాధించింది. ఈమె కడప జిల్లాలో వైయస్సార్ క్రీడా పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. ఈనెల 4వ తేదీ నుంచి 14వ తేదీ వరకు ఒడిసాలో జరుగుతున్న 13వ హాకీ ఇండియా సబ్ జూనియర్ ఉమెన్ నేషనల్ ఛాంపియన్షిప్ 2023లో ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు అందుకుంది.

రావి చెట్టు కూలి... రాక పోకలకు అంతరాయం

భామిని : స్థానిక పిహెచ్‌సి, జిజె కాలేజీ మార్గం సమీపాన ప్రధాన రహదారిపై గురువారం వీచిన గాలి వర్షంతో రావి చెట్టు కూలి సుమారు గంట పాటు 4 చక్రాల వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. విషయం తెలుసుకున్న స్థానిక పోలీస్ సిబ్బంది చెట్టు నరికి, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడంతో వాహన రాక పోకలు యధావిధిగా కొనసాగాయి.



రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్టును తొలగిస్తున్న యువకులు

వైద్యానికి ఆర్థిక సహాయం

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని వజ్జాయిగూడ పంచాయతీ గెడ్డగూడలో గతనెల 17న నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో నోటి క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న సవర కృష్ణ అనే వ్యక్తి వి.కళావతి దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు ఆమె స్పందించి అతని సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి కృష్ణకు ఆర్థిక సహాయంగా రెండు లక్షల రూపాయలు చెక్కును సిఎం సహాయ నిధి నుంచి అందజేశారు.

నేటితో ముగియనున్న పింఛనుదారుల ఇకెవైసి

కురుపాం : ఈనెల 12తో పింఛనుదారులకు ఇకెవైసి ఆఖరి తేదీ అని ఫింఛనుదారులంతా తప్పనిసరిగా ఇకెవైసి చేయించుకోవాలని స్థానిక ఉప ఖజానా అధికారి కె.శంకరరావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే కురుపాం ఉప ఖజానా కార్యాలయం పరిధిలోని ఫించనుదారుల కోసం ఈనెల 3,4,5 తేదీల్లో పలుచోట్ల ప్రత్యేక డ్రైవ్‌లను నిర్వహించామని ఇంకా ఎవరైనా మిగిలి ఉంటే శుక్రవారం ఆఖరి తేదీ కావున తప్పకుండా ఇకెవైసి చేయించుకోవాలని తెలిపారు.